ప్రజాశక్తి

బుధవారం 17 డిసెంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఆక్రమణల పర్వం!

- ఇందిరమ్మ కాలనీలో స్థలాలపై అధికార పార్టీ నేతల కన్ను!!

- ఒక్కో ప్లాటు రూ.1.50 లక్షలకు విక్రయం!!!

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలో అధికార పార్టీ నేతలు కొందరు అడ్డగోలుగా వ్యవహరి స్తున్నారు. అక్రమ సంపాదన కోసం పాకులాడు తున్నారు. అడ్డగోలు వ్యవహారంతో పట్టణ సమీపం లోని ఇందిరమ్మ కాలనీ-2లో పేదల స్థలాలను ఆక్రమించి అమ్మకాలు చేపట్టారు. నెల రోజులుగా ఈ తంతు జరుగుతోంది!



జెసిబి సాయంతో కూల్చివేస్తున్న అధికారులు

మార్కాపురం జిల్లా కాబోతున్న తరుణంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అక్రమాలకు ఏ చిన్న అవకాశం దొరికినా తెలుగు తమ్ముళ్లు వదిలిపెట్టడం లేదు. అక్రమార్కులకు అధికార పార్టీ అండగా నిలిచింది. దీంతో ప్రభుత్వ భూములు, పేదల స్థలాలపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. ఏకంగా ఇందిరమ్మ కాలనీలో పేదలకు పట్టాలిచ్చిన ఖాళీ స్థలాలన్నీ ఆక్రమించేశారు. ఇప్పటి వరకు 170 ప్లాట్లను చదును చేసి ఆక్రమించారు. ఆక్రమించిన జాగాలో బేస్ మట్టాలు నిర్మించారు. బేస్ మట్టం కట్టిన ఒక్కో ప్లాటు రూ.1.50 లక్షల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2004-2009 మధ్య కాలంలో ఇందిరమ్మ కాలనీ ఏర్పడింది. మూడు విడతలుగా ఇందిరమ్మ కాలనీ-1, ఇందిరమ్మ కాలనీ-2, ఇందిరమ్మ కాలనీ-3 మార్కాపురం పట్టణ సమీపంలోని శ్రీఅల్లూరి పోలేరమ్మ దేవస్థానానికి దిగువ భాగాన ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ కాలనీ-2లో 82 ఎకరాల్లో లేఅవుట్ అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో నిరుపేదకు 2.5 సెంటు చొప్పున ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించింది. గృహ నిర్మాణ సంస్థ ఆ స్థలంలో ఇంటి కోసం పక్కాగృహం మంజూరు చేసింది. కొన్ని గృహాలు పూర్తయ్యాయి. మరికొన్ని స్లాబు దశకు చేరుకున్నాయి. మరికొన్ని మాత్రం బేస్ మట్టాలతో సరిపెట్టారు. కడు పేదరికంలో ఉన్న పేదలు కొందరు ఆర్థిక స్థితి బాగోలేనందున ▶ 2లో

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమేనా?

- లోక్‌సభలో కొత్త బిల్లుతో ప్రయోజనాలు ఆవిరేననే చర్చ

- ఇక నుంచి రాష్ట్రం 40శాతం నిధులు భరించాలని షరతు

- ఏటా జిల్లాలో రూ.500 కోట్లకుపైగా పనులు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఉపాధి చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేయబోతోంది. యుపిఎ హయాంలో కమ్యూనిస్టుల పోరాటాలతో వచ్చిన ఈ పథకం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పేరుతో అమలు జరుగుతోంది. ఇపుడు కేంద్రం మహాత్మగాంధీ పేరును కూడా మార్చేయబోతోంది. అంతేకాకుండా కొత్తగా దీని విధివిధానాలను ఖరారు చేసింది. దీని వల్ల రాష్ట్రాలపై భారం పడనుంది. ఇప్పటి వరకూ అందుతున్న లబ్ధి కూడా ఆవిరి కానుంది. గ్రామాల ప్రగతికి కొత్తగా ప్రవేశపెట్టే బిల్లు గండి కొట్టనుంది. ఇప్పటి వరకూ కేంద్రం నుంచి వస్తున్న సహకారం తగ్గిపోనుంది. అంటే అదేస్థాయిలో రాష్ట్రాలపై ఆర్థిక భారం పడనుంది. రాష్ట్ర ఎంపీలపై ఆధారపడి నడుస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరుగుతోంది. ఎందుకంటే రాష్ట్రమే ఎక్కువగా ఈ పథకాన్ని

గ్రామీణ ఉపాధి హామీ వివరాలు....

జిల్లాలో గ్రామ పంచాయతీలు	- 729
జాబ్ కార్డులు జారీ	- 4.07 లక్షలు
వేతనాలు పొందేవాళ్లు	- 7.29 లక్షల మంది
క్రియాశీలక జాబ్‌కార్డులు	- 3.58 లక్షలు
క్రియాశీలక లబ్ధిదారులు	- 6.22 లక్షలు
ఉపాధి పొందే కుటుంబాలు	- 2.87 లక్షలు
వ్యక్తిగతంగా ఉపాధి	- 4.95 లక్షల మంది
లబ్ధి పొందిన మహిళలు	- 2.71 లక్షల మంది
లబ్ధి పొందిన ఎస్‌సి కుటుంబాలు	- 73700
లబ్ధి పొందిన ఎస్‌టి కుటుంబాలు	- 8478
సగటున వ్యక్తి పొందిన కూలి	- 252.57 రూపాయలు
వెచ్చించిన నిధులు	- 403.12 కోట్లు
సాధించిన ప్రగతి	- 87.39 శాతం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వినియోగించుకుంది. ఇప్పుడు దీనిపై తర్జనభర్జన సాగుతోంది. ఇక్కడ కూటమి నేతలు దీనిపై ఎలా స్పందిస్తారో చూడాలి. అసలు ఈ పథకం భవిష్యత్‌లో అమలు జరుగుతుందా? లేదా? అనే అనుమానాలతో పాటు పూర్తిగా ఎత్తేసినా ఆశ్చర్యం పోవాల్సిన అక్కర్లేదని చర్చ కూడా వస్తోంది. పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకంపై ఎన్‌డిఎ తీసుకున్న నిర్ణయాలు అన్ని విధాలా నష్టం కలిగించనున్నాయి. పేదలు ఐక్యమై దీన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు పూర్తిగా కేంద్రమే నిధులు ఇస్తోంది. ఈ పథకంలో పలు రకాలుగా ఉపాధి పనులు చేపడుతున్నారు. కూలీలకు పనిదినాలు కల్పిస్తున్నారు. ఏడాదికి 100 రోజులకు తగ్గకుండా పనులు కల్పించాలన్నది దీని ఉద్దేశం. ఆ మేరకు వ్యవసాయ పనులు ▶ 2లో



భూమి శుభ్రం చేసుకుంటున్న గిరిజనులు, అండగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

భూమి కోసం ధర్నా

- గిరిజనుల సమస్యను సత్వరమే పరిష్కరించాలి

- సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి-బల్లికురవ

మండలంలోని కూకట్లపల్లి గ్రామ గిరిజనుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. తమ భూ సమస్య పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు మంగళవారం ధర్నా నిర్వహించారు. దశాబ్దాలుగా తాము ప్రభుత్వం వారిచ్చిన భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ వాటిని రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రీ సర్వేతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించినా పరిష్కరించలేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారని ఆయన విమర్శించారు. ఒకరకంగా వెనుకబడిన గిరిజనుల సమస్యల పట్ల ప్రభుత్వ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. సరైన రికార్డులు లేనందువలన బ్యాంకు ▶ 2లో

టిడిపి జిల్లా అధ్యక్షుడిగా ఉగ్ర!

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో



ఉగ్ర నరసింహారెడ్డి

తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడిగా కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని అధిష్ఠానం నియమించబోతోంది. పార్టీ జిల్లా కమిటీలపై త్రిసభ్య కమిటీతో సిఎం చంద్రబాబు మంగళవారంనాడు పార్టీ కార్యాలయంలో చర్చించారు. జిల్లాల వారీగా ఎవర్ని అధ్యక్షుడిగా పెట్టాలనే అంశం చర్చకు వచ్చినపుడు ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి జిల్లా నేతలు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆయన నియామకం ఇక లాంఛనమే. ▶ 2లో

టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షునిగా సలగల రాజశేఖర్ బాబు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



సలగల రాజశేఖర్‌బాబు

బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా బాపట్లకు చెందిన సలగల రాజశేఖర్‌బాబు ఎంపికయ్యారు. జిల్లాలో సీనియర్ రాజకీయవేత్తగా ఉన్న సలగల గత అసెంబ్లీ ఎన్నికల ముందు బాపట్ల పార్లమెంట్ టీడీపి అధ్యక్షునిగా ఎంపికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బుడా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్టంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గ ▶ 2లో

ఎంపికైన కానిస్టేబుళ్లకు

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రవ్యాప్తంగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన 5,757 మంది అభ్యర్థులకు మంగళగిరిలోని ఏపీఎస్‌పి 6వ బెటాలియన్ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువగళం కార్యక్రమంలో నియామక పత్రాలను అందించారు. వారిలో బాపట్ల జిల్లాకు చెందిన 191 మంది ఎస్‌సిటిపిసి అభ్యర్థులు, వారితో పాటు వచ్చిన వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, బాపట్ల జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుంచి పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో 11 ఆర్టీసీ బస్సుల ద్వారా మంగళగిరికి రవాణా సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ పరిశీలించారు. నియామక పత్రాలు పొందనున్న అభ్యర్థులకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ మాట్లాడుతూ వేలాదిమంది పాల్గొన్న కఠినమైన పోటీ పరీక్షలో ఉత్తీర్ణులై కానిస్టేబుల్‌గా ఎంపికై, గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోవడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ విజయంలో మీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. ఇకపై సమాజం పట్ల మీ దృష్టికోణం, బాధ్యత మరింత పెరగాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా, ప్రజలకు శాంతి భద్రతలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాపట్ల ఎస్‌పి ఉమామహేశ్వర్

కల్పించే అంకితభావంతో కూడిన సేవ అని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచు కొని, ఆలోచనా ధోరణిని మార్చుకుని బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణను సమర్థవంతంగా పూర్తి చేసి విధుల్లోకి చేరిన తర్వాత, ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేలా, నేరస్తులకు హెచ్చరికగా, సమాజానికి భరోసాగా నిలుస్తూ ధైర్యంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి విజయసారథి, ఎస్‌బీ సీఐ జి నారాయణ, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ తదితర పోలీస్ అధికారులు, ఎస్‌సిటిపిసి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఒంగోలు సబర్బన్: రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన పోలీసు కానిస్టేబుళ్లకు ఈ నెల 22 నుంచి తొమ్మిది నెలల శిక్షణ ప్రారంభమవుతుంది. వీరికి మంగళవారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేసే నియామక పత్రాలను స్వీకరించేందుకు విజయవాడ బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ప్రకాశం జిల్లాకు ఎంపికైన 281 మంది ▶ 2లో

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమేనా?

(మొదటిపేజీ తరువాయి)

లేనపుడు, వేసవి కాలంలో వివిధ రకాల పనులు చేపట్టి ఉపాధి కల్పిస్తున్నారు. సగటున ఒక్కొక్కరికి రూ.250 వరకూ అందుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం దీన్ని బాగా ఉపయోగించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. లేబర్ కాంపోనెంట్ కింద కేంద్రమే పూర్తిగా సహకారం అందిస్తోంది. మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టే పనులకూ కేంద్రం 90 శాతం నిధులు ఇస్తోంది. మిగతావి వివిధ శాఖల కింద మ్యాచ్ చేస్తున్నారు. రాష్ట్రం 10శాతమే నిధులు వెచ్చిస్తోంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం కేంద్రం 60శాతం నిధులు ఇస్తే రాష్ట్రం 40 శాతం భరించాల్సిఉంది. మిగతా పథకాల మాదిరిగానే చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిధుల్లేవు. పంచాయతీలు నిధులు కేటాయించే పరిస్థితి లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున మెటీరియల్ కాంపోనెంట్‌తో చేపట్టే సిసిరోడ్లు వంటివి ఆగిపోనున్నాయి. ఈ నిర్ణయాలకు మన ఎంపీలు తలూపుతారా? లేక వ్యతిరేకిస్తారా? అన్నదీ తేలాల్సిఉంది. దీని వల్ల రాష్ట్రంపై భారం పడనుంది. జిల్లాలో చూస్తే ఏటా రూ.500 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. ఇందులో నేరుగా లేబర్ కాంపోనెంట్ పనులు రూ.325 కోట్ల వరకూ ఉన్నాయి. కోటి 30 లక్షల పనిదినాలు కల్పించారు. అదే విధంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.225 కోట్ల పనులు చేపట్టారు. అయితే ఇందులో రాష్ట్రం 10శాతం నిధులనే కేటాయిస్తోంది. ఇకనుంచి 40శాతం భరించాలి. దీంతోపాటు పథకం పేరు కూడా మార్చారు. ఇక ఉద్యోగుల్లోనూ దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఉపాధి హామీ చట్టాన్ని నమ్ముకుని వేలాది మంది సిబ్బంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారు. వేతనాల కోసం చాలా కాలంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులకు సంస్కరణలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే తాజా మార్పులతో పథకం ఉనికే ప్రశ్నార్థకమవుతోందన్న చర్చ ముందుకు వచ్చింది.

ఆక్రమణల పర్వం!

(మొదటిపేజీ తరువాయి)

గృహ నిర్మాణ సంస్థ ఇచ్చే అరకొర నిధులు ఇంటి నిర్మాణానికి సరిపడకపోవడంతో ఇంటి నిర్మాణం చేపట్టలేకపోయారు. ఆ విధంగా ఖాళీగా ఉన్న స్థలాలతో వ్యాపారం చేయాలనుకున్నారు ఇక్కడి టిడిపి నేతలు కొందరు. నెల రోజులుగా ఇందిరమ్మ కాలనీలో వదిలేసిన ఖాళీ జాగాల్లో బేస్‌మెంట్ నిర్మాణాలు చేపట్టారు. ఆ తరువాత రూ.1.50 లక్షల చొప్పున అమ్మకంతో సొమ్ము చేసుకుంటున్నారు. ఆ విధంగా అమ్మిన స్థలానికి కొనుగోలు చేసిన వ్యక్తి పేరుతో నివేశన స్థల పట్టా ఇప్పించే బాధ్యత కూడా తీసుకున్నట్లు తెలిసింది. అధికార పార్టీ నేతలు చెప్పిన మాటలకు 'భలే మంచి చౌక బేరము' అనుకుని వందలాదిగా కొనుగోలు చేసేందుకు క్యూ కట్టారు. ఆయా స్థలాలను కోల్పోతున్నామని అర్హులైన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

ఆక్రమిత కట్టడాలపై రెవెన్యూ శాఖ కొరడా!

ఇందిరమ్మ కాలనీలో పేదల స్థలాల ఆక్రమణ, ఆపై అమ్మకాలపై ప్రచారం జోరందుకుంది. ఆక్రమిత వ్యవహారంపై మార్కాపురం తహశీల్దారు కె చిరంజీవితో ప్రజాశక్తి చర్చించింది. తమ దృష్టికి ఈ విషయం రాలేదని తహశీల్దారు చిరంజీవి స్పష్టం చేశారు. తక్షణమే ఇందిరమ్మ కాలనీలో అక్రమార్కులు చేపట్టిన కట్టడాలు కూల్చివేస్తామని చెప్పారు. జెసిబి సహాయంతో ఒక్కొక్కటిగా కూల్చివేస్తున్నారు. ఈ ప్రక్రియ మంగళవారం మొదలు పెట్టారు.

టిడిపి జిల్లా అధ్యక్షుడిగా ఉగ్ర

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు ఇద్దరితోపాటు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు అందరూ ఆమో దం తెలిపారు. పార్టీకి విధేయుడిగానూ.. విశ్వాసపాత్రుడిగా ఉన్న ఉగ్రను పెడితే సమన్వయంతో ముందుకు పోతారనే అభిప్రాయం కూడా ఉంది. మంత్రి గొట్టిపాటికి సన్నిహితుడిగా ఉన్న ఆయన నేతలందరితోనూ సఖ్యతతోనూ సాగుతున్నారు. మహానాడు సమయం నుంచీ పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. యువనేత లోకేష్ పాదయాత్ర మొదలు ఎన్నికల్లో గెలుపు వరకూ పార్టీపట్ల విధేయుడిగా ముద్ర ఉంది. కనిగిరి నియోజకవర్గంలోనే ఇటీవల కాలంలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు పర్యటించగా వాటిని విజయవంతం చేయడం ఉగ్ర పనితీరుకు అద్దం పట్టింది.

21న పల్స్ పోలియో

విజయవంతానికి కలెక్టర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం వంద శాతం అమలయ్యేలా అధికారులు తగిన కృషి చెయ్యాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ కోరారు. జిల్లాలో పల్స్ పోలియో విజయవంతం కోసం మంగళవారం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్స్ పోలియో నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 1,111 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 67 మొబైల్ టీమ్‌లను, 113 రూట్ సూపర్‌వైజర్లను, 4,662 వ్యాక్సినేటర్లను, 42 ట్రాన్సిట్ బూత్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. 164 హైరిస్క్, మైగ్రేటెడ్ ప్రాంతాలను గుర్తించామని, అక్కడ 2,556 మంది పిల్లలకు పోలియోచుక్కలు వేయవలసి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సిహెచ్ రత్న మన్మోహన్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పద్మావతి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డాక్టర్ వి సోమ్లానాయక్, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, వైద్య ఆరోగ్య శాఖలోని ఇతర కార్యక్రమాల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడిగా సలగల రాజశేఖరబాబు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్ష కార్యదర్శులు, సభ్యుల ఎంపిక కోసం జరిగిన కసరత్తులో ముందుగా సలగల పేరు ప్రచారంలోకొచ్చింది. ఈసారి మార్పు జరిగితే కాపు వర్గానికి చెందిన వారికి అధ్యక్ష బాధ్యతలు ఇస్తారన్న ప్రచారం వచ్చినప్పటికీ తుదిగా సలగలనే మరో మారు బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా కొనసాగిస్తూ పార్టీ అధినేత చంద్రబాబు తుది నిర్ణయం తీసుకున్నారు. సలగల రాజశేఖర్ బాపట్ల మాజీ ఎంపి సలగల బెంజిమన్ కుమారుడు.

భూమి కోసం ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

రుణాలు, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలకు నోచుకోవడం లేదన్నారు. తక్షణమే భూములను సక్రమమైన పద్ధతుల్లో రికార్డుల్లోకి ఎక్కించాలని కోరారు. గిరిజనులు చేసే పోరాటాలకు తాము అండగా ఉంటామని తెలిపారు. అనంతరం వ్యక్తిగత అర్జీలను తహశీల్దారుకు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రవినాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పావులూరి రమణయ్య, గొల్లపూడి అంజయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందుకు నేపథ్యం..

బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో 1970వ సంవత్సరంలో సుమారు 55 మంది ఎస్‌టి యానాదులకు ప్రభుత్వం పట్టాలిచ్చారు. ఆ భూమి 1970లో ఫారెస్ట్ భూమిని డీఫారెస్ట్ చేసి పేదలకు ఇచ్చారు. అప్పటి నుంచి ఆ భూమి గిరిజనుల ఆధీనంలో ఉంది. రెవెన్యూ అధికారులు చాలాకాలం పొజిషన్ చూయించలేదు. గత రెండు సంవత్సరాలుగా ఫారెస్ట్ అధికారులు గిరిజనుల సాగును అడ్డుకుంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అనేక దఫాలు ఇచ్చినా పరిష్కారం కాలేదు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు భూముల్లోకి దిగి చెట్లను, రాళ్లను తొలగించే పని మొదలుపెట్టారు.

ఎంపికైన కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేత

(మొదటిపేజీ తరువాయి)

(సివిల్ 88 మంది పురుషులు, 38 మంది మహిళలు, ఎపిఎస్‌పి-155 మంది) కానిస్టేబుళ్లతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి సమావేశం నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి వివి రమణ కుమార్, ఒంగోలు డిఎస్‌పి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. కానిస్టేబుళ్లు శిక్షణా కాలంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి నిర్వహణలో ఉండాల్సిన బాధ్యతపై వారికి అవగాహన కల్పించారు. పోలీసు ఉద్యోగం అనేది అత్యంత బాధ్యతతో కూడినదని, ఇకపై వ్యక్తిగతంగా మరియు వృత్తిపరంగా ప్రతి ఒక్కరూ హుందాగా వ్యవహరించాలని సూచించారు. రానున్న కాలంలో టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరుగుతున్నందున, శిక్షణా కాలంలో శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కానిస్టేబుల్ వ్యవస్థ అనేది పోలీసు శాఖకు వెన్నెముక లాంటిదని, కానిస్టేబుళ్లు లేకుండా పోలీసు శాఖను ఊహించలేమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలపైనే లా అండ్ ఆర్డర్ వ్యవస్థ ఆధారపడి ఉంటుందని అన్నారు. అలాగే రోడ్డు భద్రత, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి ప్రతి అంశంలో కానిస్టేబుల్ పాత్ర అత్యంత కీలకమన్నారు. శిక్షణా కేంద్రాల్లో అందుతున్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకుని, తొమ్మిది నెలల శిక్షణను ఉత్తమంగా పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని పోలీసు అధికారులు ఆకాంక్షించారు. అనంతరం, విజయవాడకు వెళ్లే అభ్యర్థుల బస్సులను అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి వివి రమణ కుమార్, ఒంగోలు డిఎస్‌పి ఆర్ శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, డీటీసీ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు, ఆర్ఐ రమణారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ఇసుక రేవులకు అనుమతి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్


ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజల అవసరాల కోసం అదనపు ఇసుక రేవులకు అనుమతి మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజల అవసరాల కోసం కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో నూతనంగా రెండు ఇసుక రేవులకు అనుమతి మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అనుమతి మంజూరు చేసిన కొల్లూరు మండలంలోని చిలుమూరు గ్రామం ఇసుక రేవులో 4.870 హెక్టార్లలో 73,050 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. గాజుల్లంక-ఉత్తర ప్రాంతంలో 4.800 హెక్టార్లలో 72,000 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉందన్నారు. ఆ ప్రాంతాల్లో తవ్వకాలకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని గనుల శాఖ అధికారులకు ఆయన సూచించారు. భట్టిప్రోలు మండలం, ఓలేరు ఇసుక రేవు నుంచి ఇసుక సరఫరాకు అడ్డంకులు తొలగినట్లు తెలిపారు. ఓలేరు ఇసుకరేవు 4.960 హెక్టార్లలో 68,774 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందని, ఈ ఇసుక రీచ్ నిర్వహణను గత ఏజెన్సీ వర్క్ ఆర్డర్ ప్రకారం నిర్వహించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి బి రామచంద్ర, డిటిఓ పరంధామరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారులు చంద్రశేఖర్, రామలక్ష్మి, కమిటీలోని ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మద్దిపాడు

పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో నూతన సచివాలయం భవనాన్ని, ఏడుగుండ్లపాడు నుంచి లింగంగుంట వరకూ రూ.70 లక్షలతో నిర్మించిన బిటి రోడ్డును మంగళవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును సందర్శించి చెకప్ చేయించుకున్నారు. ఏడుగుండ్లపాడు 2 గ్రామ సమాఖ్యకు స్త్రీ నిధి కింద మంజురైన రూ.28,50,000 చెక్కును అందజేశారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మండలంలో అనేక అభివృద్ధి



ఏడుగుండ్లపాడు లో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వెంకట రాజుపాలెంలో పది లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించారు. బూరేపల్లి గ్రామంలో నూతన సచివాలయం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇ కష్ణమోహన్, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ ఆడక స్వాములు, రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, సున్నా బాలసుబ్రమణ్యం, పెద్దకొత్తపల్లి సొసైటీ చైర్మన్ మండవ హరిప్రసాద్, మండవ రంగారావు,గ్రామ సర్పంచ్ శిల్ప సౌందర్య, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు,క్లస్టర్ ఇన్‌ఛార్జి దేవబత్తిన ప్రసాద్, మల్లవరం ఆలయం చైర్మన్ మార్నేని రాఘవ,దాసరి రమేష్, సర్పంచి కాకర్ల విజయ్, ఎంపిటిసి దుర్గభవాని, పెనుమాక సుధాకర్, మహిళ అధ్యక్షులు దావులూరి హైమావతి, గోరంట్ల చిరంజీవి, సాంసతిక విభాగం అధ్యక్షులు నందిగం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

నారపుశెట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-దర్శి

దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటర్ వద్ద ఉన్న శ్రీరాములు, ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, టిడిపి నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ శ్రీరాములు తనయుడు పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పణిదపు వెంకట్రామయ్య, పిఎసి చైర్‌పర్సన్ బాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్న, నాయకులు కామిరెడ్డి ఎగొర్రె సుబ్బారెడ్డి, కర్ణ శ్రీను, సంగా తిరుపతిరావు, సానే సుబ్బయ్య, అచ్చిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



త్రోబాల్‌లో విజయం సాధించిన మహిళా ఉపాధ్యాయులు

మహిళా ఉపాధ్యాయుల ప్రతిభ

ప్రజాశక్తి-టంగుటూరు : ఒంగోలు డిఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్ మహిళా ఉపాధ్యాయులకు డివిజనల్ స్థాయి త్రోబాల్ పోటీలు సోమవారం నిర్వమించారు. మొత్తం 12 మండలాల మహిళా ఉపాధ్యాయులు జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మద్దిపాడు మండల మహిళా ఉపాధ్యాయుల జట్టుపై టంగుటూరు మండలం మహిళా ఉపాధ్యాయుల జట్టు విజయం సాధించింది. విజేతలను ఎంఇఒలు చెల్లి ఆనందరావు, తన్నీరు బాలాజీ , టీం కోచ్, మండల కోఆర్డినేటర్ అరుణ అభినందించారు.

బాలకోటయ్యకు మాదాసి పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన బిళ్లా బాలకోటయ్య మెదడు సంబంధిత అనారోగ్యంతో ఒంగోలు లోని సంఘమిత్ర వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అందులో భాగంగా వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య మంగళవారం బాలకోటయ్యను పరామర్శించారు. వైద్యలతో మాట్లాడి బాలకోటయ్యకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.

దర్శిలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలమెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఈ జాబ్ మేళాను ప్రారంభించారు. జాబ్ మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 165 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 107 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గొట్టి లక్ష్మి మాట్లాడుతూ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎవి.కవిత మాట్లాడుతూ స్కిల్ హబ్ ద్వారా జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్న ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ స్కిల్ హబ్ కార్పరేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభుదాస్, స్కిల్ హబ్ ప్రతినిధి డాక్టర్ ఎ.నగేష్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.గోపి, స్కిల్



డెవలప్‌మెంట్ జిల్లా అధికారి జింక రవితేజయాదవ్, జిల్లా ప్లేస్ మెంట్ అధికారి ఇ.శ్రీనివాసచారి, జిల్లా ఉపాధి యంగ్ ప్రొఫైసినల్ అధికారి రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే పాపారావుగారు, తహశీల్దారు శ్రవణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నారపుశెట్టి పిచ్చయ్య, గొట్టిపాటి లలితసాగర్, కూటమి నాయకులు కె.శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ప్రజాశక్తి -చీమకుర్తి

ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని చీమకుర్తి రిజిస్ట్రార్ మురళి తెలిపారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గహంలో విద్యార్థులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర వసతి గహాల దత్తతలో భాగంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలన్నారుజ ఉపాధ్యాయులు సూచనలమేర చదువులపై దష్టి పెట్టి మంచి మార్కులు సాధించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వసతి గృహంలోని విద్యార్థులకు



మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ మురళి

చదువులకు ఏవైనా అవసరమైతే తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.రీ కార్యక్రమంలో రిజిస్రార్ కార్యాలయ సిబ్బంది శోభ,తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల వివక్ష దారుణం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులో మాలల జేఏసీ, మాల ఉద్యోగుల సంఘ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు మాట్లాడుతూ ఎస్‌సిల పట్ల, ముఖ్యంగా మహిళల పట్ల వివక్ష చూపడం దారుణమన్నాంరు. ఒంగోలు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల శిలా ఫలకం ఆవిష్కరణ, ప్రారంభోత్సవ



మాట్లాడుతున్న అశోక్ బాబు

కార్యక్రమాల సందర్భంగా శిలాఫలకం మీద ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేరు వేయక పోవటం దారుణమన్నారు. ఒంగోలు నగర మేయర్‌ను కలిసి ఆమెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలల జేఏసీ అధ్యక్షులు కొప్పోలు ఏడుకొండలు, మేడిద రవి, మిడసల శాంతారావు, టి శ్రీకాంత్, కె.శ్రీను, యు. వెంకటరావు పాల్గొన్నారు.

ఇద్దరు క్షతగాత్రులు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ నుంచి శానంపూడి వెళ్లే రహదారిలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటనలో నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ బి. మహేంద్ర తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికులు 11 కేవీ విద్యుత్ లైను పనుల నిమిత్తం శింగరాయకొండకు వచ్చారు. శానంపూడి గ్రామంలో పనుల కోసం వెళ్తుండగా ట్రాక్టర్ అదుతప్పి బోల్తాకొట్టింది. దీతో రాహుల్ దొర్రై, సునీల్, మట్టు, గోపి అనే నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్కు తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మట్టా (27), గోపి 25) చెందారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-జరుగుమల్లి

విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకొని వారు వాటిని చేరుకొనేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంపిడిఒ తెలిపారు. మండల పరిధిలోని చిర్రికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ రమణమూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలు, మరుగు దోడ్లు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, సచివాలయ అధికారి పి.సుబ్బారావు, ఉపాధ్యాయులు, **జరుగుమల్లి :** రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని శింగరాయకొండ ఎడిఎ నిర్మలకుమారి తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంతో భూమి ఆరోగ్యం బాగుటుందన్నారు. అంతర పంటలు, భూసార పరీక్షలకు అనుగుణం ఎరువులను వినియోగించు కోవాలన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సాధించవచ్చునని తెలిపారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ కాశీ విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ధనుర్మాస వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి చీమకుర్తి

చిమకుర్తిలోని హరిహర క్షేత్రంలో ధనుర్మాస వేడుకలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ పూజ కార్యక్రమాలలో రాష్ట్ర మాజీ శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా పాండురంగారావు సుధావలి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు వెంకట హరి కుమారాచార్యులు, శిద్దా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అగ్రహారంలో ..

చీమకుర్తి మండలం అగ్రహారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి చిన్న తిరుమల ఆలయంలో ధనుర్మాస వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు శిద్దా హనుమంతరావు దంపతులు, శిద్దా భరత్, ఉదయ్ దంపతులు మంగళవారం ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు రామానుజాచార్యులు, వెంకటేశు, రవి, హరి, దామోదర్ రావు, రాంబాబు, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు కార్యకర్తలు

సిఐటియు జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - ముండ్లమూరు

సిఐటియు అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో ఈనెల 31నుండి జనవరి 4వరకు జరుగుతున్న సందర్భంగా మండల కేంద్రంలో సిఐటియు జెండా ఆవిష్కరించారు. 'ఐక్య పోరాటం' నినాదంతో కార్మిక సమస్యలపై పోరాటాల్లో సిఐటియు అగ్రభాగాన ఉందని సిఐటియు నాయకులు పి జ్యోతి పేర్కొన్నారు. 1974 చారిత్రాత్మక రైల్వే పోరాటం నుంచి నేడు కొనసాగుతున్న విశాఖ ఉక్కు ప్రైవేటుకరణ వ్యతిరేక పోరాటం వరకు సిఐటియు అగ్రభాగంలో ఉందని అన్నారు. 1975లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీని ఎదిరించిన ఏకైక ట్రేడ్ యూనియన్ సిఐటియు అన్నారు. కార్మిక హక్కులను ఎమర్జెన్సీని మించి మోడీ ప్రభుత్వం నేడు అమలు చేస్తుందని, దీనికి వ్యతిరేకంగా సిఐటియు రాజీ లేని పోరాటం చేస్తుందని అన్నారు. 11ఏళ్లుగా కేంద్రంలో బిజెపి మోడీ, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికవర్గంపై ప్రభుత్వం చేస్తున్న దాడిని వివరిస్తూ మంగళవారం కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె తిరుపతమ్మ, శ్రీను, నాగేశ్వరరావు, యేసు, కోటేశ్వరరావు, వి ఆంజనేయులు పాల్గొన్నారు.



నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - కర్లపాలెం

అగ్నిప్రమాద బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధలు మంగళవారం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. సోమవారం రాత్రి మండలంలోని ప్యారలి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బాధితులకు తాత్కాలిక గుడారాల ఏర్పాటుకు తార్పల్లిన్ పట్ట, వంట సామాగ్రి అందజేశారు. బొంత శామ్యూల్, త్యాగరాజ్ సహకారంతో దుస్తులు, నిత్యవసర సరుకులు, కూరగాయలు అందించామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బట్టు సలహా మేరకు త్యాగరాజ్ సహకారంతో అందించామని తెలిపారు. అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులతోపాటు అంబేద్కర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు మందపాటి పరమానంద కుమార్, మానవతా సభ్యులు సోమరౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పనులు పర్యవేక్షిస్తునన చిన్ని లక్ష్మిశ్రీనివాసరావు

పారిశుధ్య పనుల నిర్వహణ

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని10వ వార్డు శ్రీనగర్ కాలనీ నందు స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు పర్యవేక్షణలో కాలువల్లో బ్లీచింగ్, దోమల నివారణ మందు చల్లించారు. 5వ వార్డు రాజీవ్ కాలనిలో సానిటరీ వర్కర్లు కాలవపై సైడ్ గడ్డిని శుభ్రం చేశారు. వాతావరం కారణం వస్తున్న విషజ్వరాలనుండి ప్రజలను కాపాడేందుకు మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేయాలని చెప్పారు. కాలవలు శుభ్రం చేశారు. సానిటరీ సెక్రెటరీలు రవిప్రకాష్, విశ్వనాథం పాల్గొన్నారు.

ఘనంగా కలెక్టర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కర్లపాలెం



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న మాడసాని బాలాజీ

జిల్లాను అభివృద్ధి పదంలో నడిపిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు మానవతా శాఖ యాజలిలో ఉన్న అక్కిరాజు దిబ్బ కాలనిలో నఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మానవత సంస్థ సభ్యులు మడసాని బాలాజీ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆహార పదార్థాలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కేకును కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు చేయూత ఇవ్వటానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉమారెడ్డి రామారావు, ఎండి మొహిద్దిన్ బేగ్, మానవతా శాఖ మండల అధ్యక్షులు తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, కార్యదర్శి పరమానంద కుమార్, కోశాధికారి లలిత బాబు, డైరెక్టర్ ఇనకొల్లు పోలీసురావు, ఆట్ల బాలాజీరెడ్డి, నందిపాటి సునీల్ శ్రీరామ్, కామేశ్వరరావు, ఎం జీవన్ జ్యోతి, ఫలప్రోలు ఆంజనేయులు, ఎం మంగయ్య, ఎం ఏడుకొండలు, ఎం నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికే తొలి ప్రాధాన్యం : ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు



ఏలూరి సాంబశివరావు

ప్రజారోగ్యానికి తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా పనిచేస్తుందని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, హెూమియోపతి భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.3.82 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలిపారు. హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.36 లక్షల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. ఇడుపులపాడు, వంకాయలపాడు, గంగవరం, ఇంకొల్లు, నూతలపాడు, పూనూరు, యద్దనపూడి గ్రామాల్లో సెంటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మార్టూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. హెూమియోపతి వైద్య సేవల విస్తరణలో భాగంగా ఉప్పుటూరులో రూ.10 లక్షలు, యద్దనపూడిలో రూ.23 లక్షలతో హెూమియోపతి భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు మెరుగుపడి రోగులకు నాణ్యమైన సేవలు అందుతాయని అన్నారు.

శాస్త్రవేత్త మురళీ వరప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి- చీరాల



డాక్టర్ మురళీ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మండలంలోని దేవాంగపురి పంచాయతీ గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో బట్ట మోహనరావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బట్ట మోహనరావు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాంతో కలిసి అంతరిక్ష పరిశోధనల్లో కీలకంగా పనిచేసిన ఈపురుపాలెం వాస్తవ్యులు శాస్త్రవేత్త డాక్టర్ అందే మురళీ వరప్రసాద్‌ను సత్కరించడం గర్వకారణమని అన్నారు. డాక్టర్ మురళీ వరప్రసాద్ స్థాపించిన ట్రస్ట్ ద్వారా అనేక మంది యువకులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించారని తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉగాది పురస్కార్ అవార్డు గ్రహీత వడలి రాధాకృష్ణ, బండారు రాజేష్, గుత్తి పరంజ్యోతి, సీతారామయ్య, రోహిణి కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు




కేకు కట్ చేస్తున్న ఎంఎల్ఎ నక్క ఆనందబాబు

ప్రజాశక్తి - కొల్లూరు

తెనాలి ట్రూత్ మినిస్ట్రీస్ సహకారంతో డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ కళ్యాణ మండపంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. శాసన సభ్యులు నక్క ఆనందబాబు, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్రిస్మస్ కేకును కట్ చేసి పంచిపెట్టారు. క్రైస్తవ సోదర, సోదరీ మణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, శాంతి, సేవా వంటి మహోన్నత విలువలు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా డైరెక్టర్ సురేష్ కుమార్, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

చీరాల : మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణ మూర్తి, వైసిపి ఇంచార్జి కరణం వెంకటేష్‌బాబు సూచనలతో వైసిపి మేధావుల సంఘం అధ్యక్షుడు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. చీరాల బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వికలాంగుల సంఘ నాయకులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘ నాయకులు ఆసాధి రామిరెడ్డి, మక్కెన ప్రకాష్, షేక్ కాజవలి, అట్లా శ్రీనివాసులరెడ్డి, పేరికల జోసెఫ్, బొణిగల ప్రకాష్, ఈశ్వర్, కోటమ్మ, నాగరాజ్, పటాన్ రాసియఖాన్ పాల్గొన్నారు.



కేక్ కటింగ్ చేస్తున్న తేళ్ళ రాంబాబు



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - కారంచేడు

ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి కీలక మలుపని గౌతమ బుద్ధ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ రాఘవయ్య అన్నారు. స్థానిక యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో యుటిఎఫ్ స్టడీ మెటీరియల్‌ను సొసైటీ తరపున విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు అయ్యేంతవరకు సెల్ ఫోన్‌లు, టివిలకు దూరంగా ఉండాలని ఉపాధ్యాయులు పావులూరి శ్రీనివాస రావు చెప్పారు. యుటిఎఫ్ గత కొన్నేళ్లుగా లాభాపేక్షలు లేకుండా విద్యార్థుల ఉన్నతికి స్టడీ మెటీరియల్ అందిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు నాగరాజు, తులసి, మంత్రు నాయక్, మస్తాని, శాంతి శ్రీ, చిన్న యోగయ్య పాల్గొన్నారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న బి పద్మ మనువడు చిరంజీవి జాశ్రీత్ శ్రీవాస్తవ్ బారసాల సందర్భంగా పాఠశాల్లోని విద్యార్థులకు అందరికి వ్రాత పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కుమారి భవిష్యత్తులో ఇలాంటివి జరిపించడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకున్న సమయంలో మరొకరికి సహాయ, సహకారాలు అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దీన్ దయాల్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం పోస్టల్ డిపార్ట్మెంట్ నిర్వహించే దీన్ దయాల్ స్పర్శ యోజన స్కాలర్షిప్ పరీక్షలకు మండలంలోని కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సిహెచ్ హేమంత్ నాగ సుభాష్, సిహెచ్ పవన్ గోపికృష్ణ, పి హితేంద్ర, ఎస్ ప్రదీప్తి, ఎస్ మనీషా, 7వ తరగతికి చెందిన జి వాత్సల్య నాగలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.6వేలు స్కాలర్షిప్ వస్తుందని అన్నారు. అక్టోబర్ 12న జరిగిన ప్రిలిమినరీ పరీక్షలో పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు అర్హత సాధించగా ప్రాజెక్ట్ సబ్మిట్ చేసిన తర్వాత ఆరుగురు విద్యార్థులు ఫైనల్‌గా స్కాలర్షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రం వ్యాప్తంగా 40 మంది విద్యార్థులు ఎంపికకాగా అందులో ఆరుగురు తమ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఇలాంటి ఉపకార వేతనాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ప్రభుత్వం, వివిధ సంస్థలు కల్పిస్తున్న ఉపకార వేతనాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే కందుల

ప్రజాశక్తి-తర్లుపాడు

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ కేకే కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రతి మండల కేంద్రంలో 15 రోజులకు ఒకసారి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. అధికంగా రెవెన్యూ సమస్యలు రాగా, పెన్షన్లు, కాలనీల సమస్యలు, ఇళ్ల స్థలాల పై అర్జీలు అందజేశారు. మొత్తం మండలంలో 105 అర్జీలు రాగా, 75 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయని తహశీల్దార్ కిషోర్‌కుమార్ తెలిపారు. గత పది సంవత్సరాల నుంచి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినప్పటికీ మా భూ సమస్య పరిష్కారం కాలేదని, ఈ


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందుల

ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారానైనా పరిష్కరించాలని కొంగని రంగ లక్ష్మమ్మ ఎమ్మెల్యే ముందు వాపోయింది. వెంటనే రంగ లక్ష్మమ్మ సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్ కిషోర్ కుమార్‌కి ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. ఇంకా వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు, ఎంపీడీవో అన్నమ్మ, తహసిల్దార్ కేకే కిషోర్ కుమార్, హౌసింగ్ ఏఈ నిర్మల్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి పి. జోష్న దేవి, ఏపిఎం రమేష్, విద్యుత్ శాఖ హనుమ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగుల

దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా జరిగింది. కార్యక్రమానికి సిఐటియు అనుబంధ సహకార సంఘం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.మనోజ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

ధర్నాను ప్రారంభించిన సిఐటియు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సహకార ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 62


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

సంవత్సరాలకు పెంచాలని, ఆరోగ్య బీమా మొత్తాన్ని కనీసం రూ.5 లక్షలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 22వ తేదీన జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, 29వ తేదీన 'చలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 5 నుంచి నిరవధిక ఆందోళనలకు దిగుతామని ప్రకటించారు. అనంతరం ఉద్యోగులు తమ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని నినదిస్తూ ప్రకాశం భవన్, అంబేద్కర్ సెంటర్ నుంచి చర్చిసెంటర్ మీదుగా డిసిఓ కార్యాలయం వద్దకు వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.సత్య శివశంకర్, ప్రధాన కార్యదర్శి జి.రామాంజనేయరెడ్డి, కోశాధికారి కార్తీక్‌రెడ్డి, రామిరెడ్డి కృష్ణచైతన్య, వీరబ్రహ్మం, రమణారెడ్డి, రమేష్, శ్రీనివాసరావు, రంగయ్య, బాలాజీ ప్రసాద్, అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్, సందీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'సంతకాల' కార్యక్రమం విజయవంతం

కృతజ్ఞతలు తెలిపిన బూచేపల్లి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పార్టీ శ్రేణులకు ప్రకాశం జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి 5 లక్షలా 26 వేల సంతకాలను సమీకరించి, వాటిని ఒంగోలు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి తాడేపల్లి పార్టీ కార్యాలయానికి తరలించిన ప్రజా ఉద్యమ ర్యాలీ విజయవంతంగా నిర్వహించడంలో పార్టీ ఇన్‌ఛార్జీలు, నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడే ఈ ఉద్యమానికి విశేష స్పందన లభించిందని తెలిపారు. సంతకాల కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సహకరించిన మీడియా మిత్రులకు కూడా ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.


హెల్మెట్ పెట్టుకున్న వారిని అభినందిస్తున్న సిఐ జగదీష్

ట్రాఫిక్ నియమాల అమలుపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ మరియు వాహన తనిఖీల్లో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీసులు, కాలేజీ విద్యార్థులు మరియు వాలంటీర్లు కలిసి ఒంగోలులో మంగళవారం నాడు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగమూరు రోడ్ జంక్షన్ వద్ద హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి వాహనాలు నడిపిన వాహనదారులకు విద్యార్థుల ద్వారా చాక్లెట్లు మరియు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మాల్యాద్రి, వెంకటశివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల

కక్ష సాధింపులు అరికట్టాలి..

వేధింపులకు వ్యతిరేకంగా పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై మున్సిపల్ అధికారులు సాగిస్తున్న వేధింపులు, కక్ష సాధింపు చర్యలను తక్షణమే అరికట్టాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులపై అధికారుల వేధింపులను నిరసిస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ఒంగోలు మున్సిపల్ కార్యాలయంలో కార్మికులు బైటాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి. మహేష్ మాట్లాడుతూ శానిటేషన్ కార్మికుల వార్డుల మార్పు ప్రక్రియ శాస్త్రీయంగా కాకుండా అధికారుల ఇష్టానుసారంగా జరుగుతోందని తీవ్రంగా విమర్శించారు. పనిచేయడం లేదనే అశాస్త్రీయ కారణాలు చూపుతూ రాజకీయ కక్షతో కార్మికులను వార్డులు మార్చడం అన్యాయమన్నారు. ఒకవైపు శానిటేషన్ కార్మికులను ఫ్రంట్ వారియర్స్ అంటూ సన్మానాలు, అవార్డులు


కార్యాలయంలో బైటాయించిన నాయకులు, కార్మికులు

ఇచ్చుకుంటూ.. మరోవైపు అదే కార్మికులపై తొలగింపులు, బెదిరింపులు చేయడం ద్వంద వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఈ విధానం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్రపాటి శ్రీనివాసరావు, యూనియన్ నగర అధ్యక్షురాలు టి. విజయమ్మ, నగర కార్యదర్శి గడ్డం నరసింహ, యూనియన్ నాయకులు యు. రత్న కుమారి, ఎం. లక్ష్మీకాంతం, పి. కోటేశ్వరి, బి. బుల్లెమ్మ, డి. అంకమ్మ, పి. సుభాషిని, భారతి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పేరు మార్చడం సరి కాదు..

చట్టం సవరణ బిల్లుల ప్రతులు దహనం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి చట్టం పేరును మార్చడం సరైన నిర్ణయం కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఎనికపాడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి చట్టం సవరణ బిల్లుల ప్రతులు దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సవరణ చట్టంలో వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే



బిల్లుల ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

విధంగా కొన్ని అంశాలు చేర్చడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో ఈదర సుబ్బారావు, రైతుసంఘం మండల కార్యదర్శి ఎన్వి నరసింహం, అంజయ్య, సింగయ్య పాల్గొన్నారు.

పేదల హక్కులపై 'మోడీ' ప్రభుత్వ దాడి

- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రద్దు కుట్ర - అఖిల భారత రైతుకూలీ సంఘం విమర్శ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను రద్దు చేసి, దాని స్థానంలో 'వికసిత్ భారత్ అజీవికా మిషన్-గ్రామీణ్' పేరుతో కొత్త చట్టం తీసుకురావాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు పేదల హక్కులపై నేరుగా దాడి చేయడమేనని అఖిల భారత రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఆ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మంగళవారం నాడు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కార్యవర్గం డిమాండ్ చేసినట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధంగా గ్రామీణ పేదలకు ఉపాధి హక్కును కల్పించిన 2005 నాటి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టాన్ని తొలగించడం ద్వారా కోట్లాది కుటుంబాల జీవనాధారాన్ని కూల్చివేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని సంఘం విమర్శించినట్లు పేర్కొన్నారు. ఉపాధి భద్రతకు భరోసా కల్పించిన చట్టాన్ని నిర్వీర్యం చేయడానికే ఈ బిల్లు రూపకల్పన చేశారన్నారు.

జీవితం విలువైంది...జాగ్రత్త వహించండి..

- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం - ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి-మద్దిపాడు

జీవితం విలువైందని జాగ్రత్త వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణే తమ లక్ష్యమని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. మండల పరిధిలోని వెల్లంపల్లి, గ్రోత్ సెంటర్లోని బ్లాక్ స్పాట్లను మంగళవారం పరిశీలించారు. బ్లాక్ స్పాట్ ఉన్న ప్రదేశాల వాహనాలు యొక్క వేగమును నియంత్రించేలా సుస్పష్టమైన సైన్, హెచ్చరిక బోర్డులను, అవసరమైన చోట్ల, క్యాట్ ఐస్, కాన్వెక్స్ మిర్రర్, రేడియం బ్లింకర్స్, మలుపుల వద్ద రేడియం స్టిక్కర్స్, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైవే రోడ్ పై వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. గ్రోత్ సెంటర్ వద్ద ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళలు, పురుషులు బస్సుల కోసం నిలబడతామని, కానీ ఇక్కడ బస్సులు


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఆపకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎస్పీ ఆర్టీసి ఆర్ఎమ్‌తో మాట్లాడి మహిళలు పడుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. గ్రోత్ సెంటర్‌లో మహిళలు ఇబ్బందులు పడకుండా చేయి ఎత్తితే బస్సు ఆపే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీకి ఆర్టీసీ ఆర్ఎమ్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా అక్కడ చెత్తను పూర్తిగా తొలగించి బస్సుస్టాప్ కూడా ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ప్రయాణికులు బస్సు ఎక్కేందుకు అనుకూలంగా లేని ప్రదేశాన్ని పరిశీలించి, ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ పి. రాజాబాబుకు తెలియజేశారు. ఈ క్రమంలోనే విజయవాడ వైపు వెళ్తున్న కలెక్టర్ గ్రోత్ సెంటర్ వద్ద జిల్లా ఎస్పీని చూసి కారు ఆపారు. ఈ సందర్భంగా అక్కడ సమస్యను కలెక్టర్ దృష్టికి ఎస్పీ తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎన్ హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనిల్ కుమార్, ఎన్ హెచ్ టీం లీడర్ సురేష్ బాబు, ఒంగోలు తాలూకా సీఐ విజయకష్ణ, మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓలు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక వైఆర్ ఉన్నత పాఠశాల్లో మండల స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఇంజనీరింగ్ టెక్నాలజీ విభాగాలో ఎగ్జిబిషన్లో నిర్వహించినట్లు ఎంఈఓ శివ కోటేశ్వరరావు తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాగులపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు ఆటోమేటిక్ ప్రొటెక్షన్ ఆఫ్ క్లోత్స్ ఫ్రమ్ రైన్ తయారు చేసిన సైన్స్ ప్రదర్శనకు గ్రూపు విభాగంలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. చెరుకూరు జడ్పీ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన స్మార్ట్ గార్డుకు ద్వితీయ స్థానం లభించిందని పేర్కొన్నారు. వ్యక్తిగత విభాగంలో ఎబిపాలెం జడ్పీ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన హైడ్రాడిలిక్ లిఫ్ట్‌కు మొదటి స్థానం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తారు రోడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం

వేగంగా బొల్లాపల్లి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - మార్టూరు

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జాతీయ రహదారి ఎన్‌హెచ్16 నుంచి బొల్లాపల్లి గ్రామానికి రూ.65 లక్షల వ్యయంతో తారు రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యా సంస్థలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అత్యవసర సేవలకు గ్రామాలకు వేగంగా చేరుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని ఈదర, పూరిమెట్ల, ఉమామహేశ్వరపుర అగ్రహారం, నాయుడుపాలెం గ్రామాల్లో భూసార పరీక్ష ఫలితాల కార్డుపై అవగాహన కల్పించారు. డిఆర్‌సి వ్యవసాయాధికారి వివి శేషమ్మ భూసార పరీక్షా ఫలితాల కార్డు, నేల ఆరోగ్యం గురించి వివరించారు. వీటి ఆధారంగా వివిధ పంటల్లో ఎరువుల యాజమాన్యం, సేంద్రియ, జీవన ఎరువుల ప్రాముఖ్యత, వాటి వాడకం, పంట అవశేషాలు కాల్చడం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. ఎఒ ఎ తిరుమలరావు వ్యవసాయ పథకాలు, ధాన్యం కొనుగోలు గురించి వివరించారు. నేల ఆరోగ్యం, భూసార పరీక్షా విధానం, ఫలితాల వివరణ, సమస్యాత్మక భూములు బాగు చేయుట, జీవన ఎరువుల గురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే రుణాలు రాస్తారు

- ఒక్కొక్కరి నుండి రూ.500 వసూళ్లు
- డబ్బు ఇస్తేనే రుణాలు మంజూరు
- స్త్రీ నిధికి 24నెలలు డబ్బు తీసున్నారు
- డబ్బు ఇవ్వటం ఆలస్యమైతే పెనాల్టీ
- గోడు వెళ్ళబోసుకున్న మహిళలు



మాట్లాడుతున్న బ్యాంకు డైరెక్టర్ యార్లగడ్డ రమ

ప్రజాశక్తి - పంగులూరు

డ్వాక్రా మహిళల పరిస్థితులు, వాళ్ల బాగోగులు తెలుసుకోవడానికి వచ్చిన బ్యాంకు లింకేజీ అడిషనల్ డైరెక్టర్ యార్లగడ్డ రమ ముందు మండలంలోని చందలూరు గ్రామ దళిత కాలనీ పొదుపు సంఘాల మహిళలు తమ గోడు వెల్లపోసుకున్నారు. గ్రామ దళిత కాలనీకి మంగళవారం వచ్చిన ఆమె డ్వాక్రా మహిళలతో సమావేశం అయ్యారు. స్త్రీనిధి, బ్యాంకు రుణం, ఉన్నతి రుణం, సిసిఎల్, ఇలా ఏ రుణం తీసుకోవాలన్న ఇక్కడ యానిమినేటర్లకు ఒక్కొక్క మహిళ రూ.300 నుండి రూ.500 వరకు ఇవ్వాల్సి వస్తుందని, ఇవ్వకపోతే తాము రుణం రాయమని అంటున్నారని మహిళలు తెలిపారు. రోజంతా ఎండలో కష్టపడి పని చేస్తే రూ.300 కూడా రావడం లేదు. కానీ పుస్తకాలు రాసినందుకు, రుణాలు రాసినందుకు మాత్రం ఆ డబ్బులు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. స్త్రీనిధి రుణం తీసుకున్న తర్వాత తమ చేత 24 నెలల పాటు డబ్బులు తీసుకుంటున్నారని, 24వ నెల చివర్లో రూ.500 మాత్రం తిరిగి ఇస్తున్నారని అన్నారు. స్త్రీ నిధి డబ్బులు 23 నెలల పాటు చెల్లిస్తే సరిపోతుందని తెలిసిందని, ఇది ఎంతవరకు నిజమని బ్యాంకు లింకేజీ అడిషనల్ డైరెక్టర్ యార్లగడ్డ రమను నిలదీశారు. స్త్రీని రుణం చెల్లించటం ఒక్క గంట ఆలస్యమైనా రూ.100 పెనాల్టీ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ డబ్బులు స్త్రీ నిధిలో జమ అవుతున్నాయా లేదా తమకు తెలియటం లేదని తెలిపారు. యానిమినేటర్లు తమకు చెప్పటం లేదని అన్నారు. ఉన్నతి రుణాలు సక్రమంగా అందరికీ రాయడం లేదని, తమ అవసరాలకు వాటిని ఉపయోగించటం లేదని తెలిపారు. సీసీఎల్ రుణాలు చెల్లించిన ఒకటి, రెండు గ్రూపులు చెల్లించలేదని అందరికీ రుణాలు ఆపేసారని తెలిపారు. వ్యవసాయం కోసం తీసుకునే ఆ రుణాలు ఆపడం వలన ఇప్పుడు వ్యవసాయ పనులకు ఇబ్బంది అవుతుందని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ యార్లగడ్డ రమ మాట్లాడుతూ గత 25ఏళ్లుగా రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల అభివృద్ధికి, వారి జీవనోపాధి వృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అయితే సభ్యులకు పుస్తకాలు రాసినందుకు కానీ, రుణాలు ఇప్పించినందుకు గాని ఎవరు ఒక పైసా చెల్లించాల్సిన అవసరం లేదని, అలా డబ్బులు తీసుకోవడం నేరమని అన్నారు. విఒఎలకు ప్రతినెల గ్రామ సంఘం నుండి రూ.10వేల గౌరవ వేతనం అందిస్తున్నామని తెలిపారు. అందువలన సభ్యుల నుండి ఎలాంటి డబ్బులు వసూలు చేయకూడదని అన్నారు. డ్వాక్రా మహిళల డబ్బులతో స్త్రీ నిధి బ్యాంకును ఏర్పాటు చేశారని, ఆ బ్యాంకు మీ అందరిదని మహిళలను ఉద్దేశించి అన్నారు. స్త్రీనిధి వడ్డీ డబ్బును డ్వాక్రా ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. ఇక నుండి డ్వాక్రా సభ్యులు కుటుంబ అవసరాలకు ఎంత కావాల్సి వస్తే అంత బ్యాంకు దగ్గరికి వెళ్లి బయోమెట్రిక్ వేసి రుణం అడగాలని, ఈ పని సీసీ చేయాలని చెప్పారు. డ్వాక్రా గ్రూపు లీడర్లు గ్రామ సంఘం మీటింగుకు తప్పనిసరిగా హాజరుకావాలని, మీటింగులకు హాజరు అవ్వటం అలవాటుగా చేసుకోవాలని కోరారు. ఉన్నతి రుణం అర్హతను బట్టి ఇస్తారని, ఉన్నతి రుణానికి వడ్డీ లేదని చెప్పారు. మహిళల జీవనోపాదులు మెరుగు పర్చుకునేందుకు ఆన్లైన్ దిశగా రుణాల పంపిణీ, రికవరీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. భారతదేశంలోని రికవరీలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. మన డబ్బు, మన లెక్కలోనే పద్ధతిలో మహిళలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. చందలూరుకు సంబంధించి రూ.7 కోట్ల బ్యాంకు రుణాకు ప్రణాళిక పెట్టమని, ప్రస్తుతం రూ.ఒక కోటి మాత్రమే గ్రౌండ్ చేశారని చెప్పారు. మహిళలు ఐక్యంగా ఉండి, జీవనోపాదులు పెంపొందించుకునేందుకు కృషి చేయాలని కోరారు. బ్యాంకు లింకేజీ డీపీఎం ఎ లక్ష్మణాచారి మాట్లాడుతూ జిల్లాకు రూ.8.50 కోట్ల ఉన్నతి రుణాలు వచ్చాయని చెప్పారు. ప్రతి మండలానికి రూ.30 లక్షల లెక్కన మంజూరు చేశామని చెప్పారు. ఈ రుణాలకు మహిళలు గొడవలు పడకుండా ఐక్యమత్యంగా ఉండి వాటిని తీసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల ఎపిఎం ఫణి బాబు, పంగులూరు ఎపిఎం కోటేశ్వరరావు, చందలూరు క్లస్టర్ సిసి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అపరాల పంటపై వేప నూనె పిచికారీ చేయాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రస్తుత రబీ సీజన్లో సాగు చేసే అపరాలకు పంటపై ఒకసారి వేప నూనె పిచికారి చేయాలని ఎఒ ఎండి ఫారుక్ హుస్సేన్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని పొన్నపల్లి, నడింపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రబీ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు సూచనలు చేశారు. అపరాలు విత్తే ముందు విత్తన శుద్ధి చేయాలని తెలిపారు. అపరాలు కిలో విత్తనానికి 2.5 గ్రాముల థైరాము, కాప్టాన్, మాకోజబ్, కార్బెండిజమ్, 5ఎంఎల్ ఇమిడా క్లోప్రిడ్ ఏదోఒకటి కలిపి విత్తన శుద్ధి నిర్వహిస్తే తెగుళ్లు, రసం పీల్చే పురుగుల భారి నుండి పంట కాపాడుకోవచ్చని తెలిపారు. మినుము పంట పల్లాకు తెగులును తట్టుకునే టిబిజి 104, ఎండు తెగులు తట్టుకునే ఎల్‌బిజి 685 రకాలు విత్తుకోవాలని తెలిపారు. వరి కోత అనంతరం పంట అవశేషాలు కొంతమంది రైతులు కాలుస్తున్నారని, అలా చేయకుండా పంట వ్యర్థాలు భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారాన్ని పెంచుకొని అధిక దిగుబడులు సాధించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని రైతులకు 313 టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఎఒ షేక్ సైద తెలిపారు. మామిళ్ళపల్లి, కొమ్మాలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నానో యూరియా వాడాలని సూచించారు. కార్యక్రమంలో విహెచ్‌ఎ కె పరమేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకుపల్లి ఎఒ ఫారూఖ్ హుస్సేన్

చీరాల : మండలంలోని దేవినూతల, కావూరివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎఒ నిర్మలా దేవి మొక్కజొన్న పంటపై రైతులకు సూచనలు చేశారు. ఎరువుల యాజమాన్యం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని తెలిపారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా దుక్కిలో ఒకసారి, మోకాలు ఎత్తు మొక్క వచ్చినప్పుడు ఒకసారి, పంట మొదలైన దశలో మరోసారి యూరియా వేయాలని వివరించారు. ఎకరాకు 30 కిలోల భాస్వరం ఎరువులు దుక్కిలో వేయాలని, 50 కిలోల పొటాష్ దుక్కులో ఒకసారి, కండె వచ్చిన దశలో మరోసారి వేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ అద్దూరి శ్రీనివాసరావు

అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రతి ఒక్కరు మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ అద్దూరి శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ యారం వనజ మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సకాలంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యక్షులు పి సుబ్బారావు, తహశీల్దారు షాకిర్ పాషా, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ

కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర

ప్రజాశక్తి - అద్దంకి

ధాన్యం మద్దతు ధరకు అమ్ముకోవాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం మద్దతు ధర క్వింటాల్ ఎ గ్రేడ్ రకం రూ.2389 లభిస్తుందని తెలిపారు. గోతాలు, రవాణా ఛార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. నివారణకు ఫిప్రోనిల్ ఎకరాకు 400 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ పృథ్వీ సాయి, ఎఇఒ కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొల్లూరు

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొని ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్రమైన గాయాలైన ఘటన మండలంలోని క్రాప రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం వేమినేని నాగమల్లేశ్వరరావు కొల్లూరు నుండి క్రాప వెళ్తుండగా క్రాప నుండి కొల్లూరుకు గోరికిపూడి రవికుమార్ (మోజేష్) వస్తున్నారు. వీరిద్దరూ క్రాప రోడ్డులో ఎదురెదురుగా ఢీ కొనగా వేమినేని నాగమల్లేశ్వరరావు (51) అక్కడికక్కడే మృతి చెందగా గోరికిపూడి రవి కుమార్‌కు తీవ్రమైన గాయాలయ్యారు. క్రాప గ్రామానికి చెందిన ఇద్దరూ ప్రమాదానికి గురయ్యారు. రవికుమార్‌ను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నారు. ప్రమాదం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని వైదన గ్రామానికి చెందిన వేణుగోపాల్ తరచు మద్యానికి బానిసై బాధ్యత రాహిత్యంగా తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారని గడ్డి మందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని వైదన పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన నాగబోయిన నాగరాజుపై అదే గ్రామానికి చెందిన వారు దాడి చేసి గాయపరిచినట్లు నాగరాజు స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. నాగరాజును చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విజయవంతంగా సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ 2025 విజయవంతంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్ ఆస్మిని ప్రథమ స్థానం, కొండ మంజూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి హితేంద్ర ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. బూదవాడ పాఠశాలకు చెందిన జి హరిణి, వి సుమశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, కొండ మంజూరు పాఠశాలకు చెందిన కె జాకబ్ జపాన్, ఎన్ వెంకట చరణ్ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఉపాధ్యాయ విభాగంలో బూదవాడ పాఠశాలకు చెందిన ఐ చంద్రశేఖరరావు దక్కించుకున్నారు. ఎంఇఒలు కె నాగభూషణం, జి వీరాంజనేయులు మాట్లాడుతూ విజేతలైన అభ్యర్థులు ఈనెల 19న జిల్లా కేంద్రమైన బాపట్లలో జరిగే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రదర్శనకు వాడరేవు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌కె మీరాజాన్, వేముల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె స్వర్ణలత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పూసల రఘురామయ్య, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, వివిధ పాఠశాలలకు చెందిన సైన్సు ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసి చైర్మన్ అలవల శ్రీనివాసరెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ బి బాబురావు

18 నుండి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలిగే విధంగా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు అందించేందుకు డిసెంబర్ 18 నుండి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రారంభమవుతుందని ఎంపిడిఒ బి బాబురావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులకు ఏకీకృత కుటుంబ సర్వేపై జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు ఈ సర్వేను ప్రభుత్వ నిబంధనల మేరకు సమగ్రంగా, పారదర్శకతతో నిర్వహించాలని అన్నారు. ప్రతి కుటుంబంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ బెనిఫిట్ సర్వేను నిర్వహిస్తుందని అన్నారు. ఉద్యోగులు అలసత్వం వహించకుండా సర్వే పూర్తి చేయాలని అన్నారు. రిసోర్స్ పర్సన్లు సర్వే చేయాల్సిన అంశాలు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ (జిఎస్‌డబ్ల్యుఎస్) పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చీరాల

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని శక్తి టీం ఎస్‌ఐ హరిబాబు అన్నారు. శక్తి యాప్, డ్రగ్స్ నిరోధంపై ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ మోయిన్ సూచనలతో వేటపాలెం మండలం పుల్లరిపాలెంలో ఎంపియుపిఎస్, కొత్తరెడ్డిపాలెం పాఠశాల్లో అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల ప్రమాదాలు వివరిస్తూ 'డ్రగ్స్ వద్దు బ్రో' ప్రచారం, పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. కానిస్టేబుల్ కె సుబ్బారావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ఎంతగానో ఉపయుక్తమని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి రాణి, ఉపాధ్యాయులు ఎ జగదీష్, ఆర్‌వి శ్రీనివాస్, ఎం సుజాత, టి కళ్యాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆనందబాబుకు అవమానం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్లలో అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహావిష్కరణ ఫ్లెక్సీపై వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఫోటో లేక పోవడంతో ఆయనకు తీరని అవమానం జరిగిందని చర్చ జరుగుతుంది. బిజెపి ఆధ్వర్యంలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల వై జంక్షన్ వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వేదిక వద్ద ప్రధాన ఫ్లెక్సీపై ఆనందబాబు ఫోటో లేకపోవడంతో అవమానంగా భావించిన ఆయన సభ జరుగుతున్న సమయంలో వేదిక నుండి దిగి వెళ్లిపోయారు. బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణకు ఆయనను ఆహ్వానించారు. సభా స్థలి వద్ద ఫ్లెక్సీల్లో జిల్లాలోని ఐదుగురు ఎమ్మెల్యేల ఫోటోలు ప్రచురించగా ఆనందబాబు ఫోటో లేకపోవడం చర్చనీయాంశమైంది. మాజీ మంత్రిగా, టిడిపి పోలెట్ బ్యూరో సభ్యులుగా ఉన్న ఆనందబాబు ఫోటో లేకపోవడం వివక్ష చూపడమేనని ప్రచార, ప్రసార మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.



సభాస్థలి వద్ద ఆనందబాబు ఫొటో లేని బ్యానర్లు

హాజరుకాని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహావిష్కరణకు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ హాజరు కాకపోవడంపై చర్చ జరుగుతోంది. విగ్రహం ఏర్పాటు సన్నాహక సమావేశాల్లో పాల్గొని, విగ్రహ ఏర్పాట్లు పరిశీలించిన ఆయన విగ్రహావిష్కరణకు హాజరు కాకపోవడం ఏమిటనే చర్చ జరుగుతోంది.

మాజీ ప్రధాని పివి నరసింహారావు గుర్తుకు రాలేదా?

ప్రజాశక్తి - బాపట్ల

మాజీ ప్రధాని అటల్ బిహారీవాజ్ పేయి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అట్ట హాసం చేసిన నాయకులకు మన రాష్ట్రానికి చెందిన తొలి తెలుగు ప్రధాని పివి నరసింహారావు గుర్తుకు రాకపోవటం బాధకరమని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా విగ్రహాల ఏర్పాటుపై ఉన్నంత శ్రద్ధ పట్టణంలో రహదారి విస్తరణలో తొలగించి పక్కన పెట్టిన విగ్రహాల ఏర్పాటుపై లేదన్నారు. ప్రజాకవి గుర్రం జాషువా, అమరజీవి పొట్టి శ్రీరాములు, కోన ప్రభాకరరావు, ఎన్టీఆర్ విగ్రహాల గురించి పట్టించుకోని అధికార యంత్రాంగం ఆఘమేఘాలపై వాజ్‌పేయి విగ్రహానికి అనుమతి ఏవిధంగా ఇచ్చారని అన్నారు. అనుమతి ఇవ్వకపోతే నిర్మాణం జరుగుతుంటే ఏమి చేశారని ప్రశ్నించారు. వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు చేసిన స్థలం జాతీయ రహదారి నిర్మాణంలో మిగిలిన సొసైటీ భూమని గుర్తు చేశారు. ఈవిషయంపై సరైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి మూలబడి



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి

మగ్గుతున్న తొలగించిన విగ్రహాలను తక్షణమే ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, యువజనవిభాగం రాష్ట్ర కార్యదర్శి నక్కా వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, ఇనగలూరి మాల్యాద్రి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, చల్లా రామయ్య, జోగి రాజా, అడే చందు, మోర్ల సముద్రాల గౌడ్, రెడ్డి అంకయ్య, మచ్చా శ్రీనివాసరెడ్డి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేస్తున్న పొగ

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండల కేంద్రమైన ఇంకొల్లులోని కడవకుదురు రోడ్డులో ప్రయాణించే వాహనదారులు రోడ్డుపై కమ్మే దట్టమైన పొగతో ఇక్కట్లు పడుతున్నారు. పొగలో ఎదుటి వాహనాలు కనపడకుండా ప్రమాదాల సంభవించిన సంఘటనలు ఉన్నాయి. ఇంకొల్లు బస్టాండ్, సినిమా హాల్ సెంటర్ నుంచి కడవకుదురు వెళ్లే రోడ్డులో ఒకటవ మైలు బ్రిడ్జి వద్ద పంచాయతీ సిబ్బంది సేకరించే వ్యర్థాలను రోడ్డు మార్జిన్ ఆనుకొని డంపింగ్ యార్డుగా గత కొన్ని రోజులుగా వేస్తున్నారు. నిత్యం అక్కడే కొబ్బరి బోండాలు, చెత్తాచెదారాలు వాహనాలతో తరలించి పడవేస్తున్నారు. గ్రామంలో కొబ్బరి బోండాలు అమ్మే దుకాణదారులు కొబ్బరి బోండాల సైతం వాహనాల్లో అక్కడే పడేస్తున్నారు. గంగవరం రోడ్డులో చెత్త నుంచి సంపద సేకరించే కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ అది లోతట్టు ప్రాంతంలో సవిటి నెలలో ఉండటంతో వర్షానికి నీళ్లు స్తున్నాయి. ఆ ప్రాంతం అనుకూలంగా లేదు. ప్రతిరోజు ప్లాస్టిక్ చెత్త, తదితర వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో ఆ మంటలు దట్టంగా రోడ్డును కమ్ముతున్నాయి. ఆ ప్రాంతానికి పోగానే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు ఒకదానికొకటి కనపడే పరిస్థితి లేదు. లైట్లు సిగ్నల్స్ వేసినా కూడా కనపడని పరిస్థితి. వాహన దారులు పొగ దట్టంగా వ్యాపిస్తూ ఉండటంతో కళ్ళు చూడలేని పరిస్థితి. ఇంకొల్లు నుంచి భీమవరం, ముప్పాళ్ళ,



ఇంకొల్లు, కడవకుదురు రోడ్డును కమ్మేస్తున్న పొగ

చింతగుంపల, గొనసపాడి, కడవకుదురు, చినగంజాం వరకు రద్దీగా వాహనాలతో ప్రయాణిస్తూ ఉంటారు. ఆ ప్రాంతాల నుంచి ఇంకొల్లు వస్తూ ఉంటారు. చిన్నగంజాం, కడవకుదురు, పందిళ్ళపల్లి గ్రామాల నుంచి ఇసుక ట్రాక్టర్లు, ఆర్టీసీ బస్సులు, ఉప్పు రవాణా చేసే వాహనాలు, కూరగాయలమ్మే జీవులు, ఆటోలు వస్తూ ఉంటాయి. సింహాల సెంటర్ కడకుదురు రోడ్డులో పలు రకాల ఆటోలు, ట్రాక్టర్ పనులు నిర్వహిస్తుంటారు. ఆ ప్రాంతాల నుంచి నిత్యం ట్రాక్టర్లు, ఇతర వాహనాలు మరమ్మతులకు, పెట్రోల్ బంకులు, సినిమా హాల్ సెంటర్లో ఉండటంతో నిత్యం ప్రయాణం ఎక్కువగా జరుగుతూ ఉంటుంది. ఇంత రద్దీ అయిన ప్రాంతంలో రోడ్డులో వెంబటే దట్టమైన పొగలు వచ్చేటట్లు మంటలు వేయటంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పంచాయతీ దీని నివారణ చర్యలు చేపట్టాలని, ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ జి రఘునాథరెడ్డి

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో ఈనెల 21న నిర్వహించే పల్స్ పోలియో విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మునిసిపల్ కమీషనర్ జి రఘునాథరెడ్డి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు అందించాలని అన్నారు. ఆ రోజు వేయించలేకపోతే 22, 23 తేదీల్లో ఇంటింటికి వెళ్లి అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నూటికి నూరు శాతం లక్ష్యాలు సాధించాలని అన్నారు. సమావేశంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఐఇ కోఆర్డినేటర్ మట్ట జోత్స్న

భవిత కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడిలోని ఎంపిపిఎస్ భవిత కేంద్రాని ఐఇ కోఆర్డినేటర్ మట్ట జోస్న మంగళవారం సందర్శించారు. పరిశీలన అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. భవిత కేంద్రంలో విద్యార్థులకు శిక్షణ, వారికి నేర్పిస్తున్న విద్య గురించి పిల్లల తల్లి దండ్రులకు వివరించాలని అన్నారు. గతేడాది కాలంలో పిల్లల్లో వచ్చిన మార్పును తెలియజేయాలి అన్నారు. సిడబ్ల్యుఎస్‌ఎన్‌పై సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం ప్రసాద్, ఐఇఆర్ పి చంద్రశేఖర్, సురేఖ, పిజియోతెరపి గీతిక పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పిల్లలకు అన్నదానం

ప్రజాశక్తి - భట్టిపోలు

వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గంలోని గ్రామాల్లో వైసీపీ అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నండూరి కార్తీక్ పర్యవేక్షణలో పేద పిల్లలకు అన్నదానం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అశోక్ బాబు మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్, పల్లికోన సర్పంచ్ బొల్లేదు ప్రతాప్, భట్టిప్రోలు మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నభి, దాసరి కిరణ్ బాబు, వేల్పూరి నాగేశ్వరరావు, పెట్ల కిరణ్ బాబు, కొక్కిలిగడ్డ గోపి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - భట్టిపోలు

ప్రధాని మోడీ నాయకత్వంలో కేంద్ర మంత్రి చవాన్ మార్గదర్శకత్వంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ కూలీల వేతనాల కోసం రాష్ట్రానికి రూ.988 కోట్లు విడుదల చేయడం పేదలకు ఊరట ఇస్తుందని జనసేన గుంటూరు జిల్లా కార్యదర్శి సోమరౌతు అనూరాధ తెలిపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైసీపీవి అసత్య ఆరోపణలు

- పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీల నిర్మాణం
- రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-రేపల్లె

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా నిర్మించే మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తున్నారంటూ వైసీపీ అసత్య ఆరోపణలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పీపీపీ విధానం ద్వారా మెడికల్ కళాశాలల నిర్మాణాల్లో వేగం పెరుగుతుందని అన్నారు. నిర్మాణం పూర్తయిన అనంతరం కాలేజీలపై నియంత్రణ, యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందన్నారు. తద్వారా వైద్య విద్య ఎక్కువ మందికి అందుబాటులోకి వస్తుందని అన్నారు. పీపీపీ విధానంలో నిర్మిస్తున్న కొత్త మెడికల్ కాలేజీలతో పాటు ప్రతి మెడికల్ కాలేజీలో కనీసం 150 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇక, వైద్య విద్య, ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి అనగాని తెలిపారు. ఆర్థిక సమస్యలతో మూలనపడ్డ కాలేజీలను మళ్లీ పీపీపీ విధానంలో పట్టాలు ఎక్కించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. సుదీర్ఘ కసరత్తు చేసి కేబినెట్‌లో సమగ్రంగా చర్చించి తీసుకున్న నిర్ణయంపై వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరైన విధానం కాదని అన్నారు. జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్లు ఖర్చు పెట్టి 5 మెడికల్ కాలేజీలు కూడా కట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. పీపీపీ విధానంలో రెండేళ్లలోనే మెడికల్ కాలేజీల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అనంతరం 41 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.86 లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పంతాన్ని మురళీధర్‌రావు, లక్ష్మోజి, ధర్మతేజ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



పరిశీలిస్తున్న డ్వామా పీడీ జి జోసఫ్ కుమార్

క్యాటిల్ షెడ్ నిర్మాణ స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం, కొండపి గ్రామపంచాయతీల పరిధిలో కమ్యూనిటీ క్యాటిల్ షెడ్స్ నిర్మాణ స్థలాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ప్రాజెక్ట్ డైరెక్టర్ జి జోసెఫ్ కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎన్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. అనంతరం ప్రతి నియోజక వర్గంలో ఒక చెరువును అభివృద్ధి చేసేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం గ్రామ పంచాయతీలోని కోనేరు (కోసరు చెరువు) వాటర్‌షెడ్ నిధుల ద్వారా ల్యాండ్ లెవెలింగ్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ అభివృద్ధి చేయడానికి వీలున్న అవకాశాలను వారు పరిశీలించారు. ఈ సందర్శన కార్యక్రమంలో సంబంధిత మండల అభివృద్ధి అధికారులు ఎంపిడిఒ, ఎపిఒలతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సాంకేతిక వాడకం పెంపుదలపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు డిజిటల్ సాంకేతికత వాడకం పెంపు చర్యలపై ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల శాఖ సహాయక మంత్రి, సుశ్రీ శోభా కరండ్లాజే సమాధానమిస్తూ దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు డిజిటల్ సాంకేతికత వాడకాన్ని పెంచటానికి కేంద్ర ఎలక్ట్రానిక్, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ డిజిటల్ ఇండియా కార్యక్రమంలో హార్డ్‌వేర్ - సాఫ్ట్‌వేర్ ఆధారిత సాంకేతికాలు, పాలనా సేవలను అందిస్తుందని తెలిపారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల మంత్రిత్వ శాఖ ఇతర సంస్థల భాగస్వామ్యంతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. కార్యకమాలను అమలుచేసే సంస్థలకు నేరుగా నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలియజేశారు.

ప్రభుత్వ వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. మందులు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. రోగులు, వైద్యులు కొన్ని విషయాలను ఎమ్మెల్యే కందుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇంకా మెరుగు పడాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కందుల గుర్తించారు. ఐసియు సౌకర్యం కల్పించేలా కృషి చేస్తామన్నారు. వైద్యుల కొరత, సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. వైద్యశాలలో అవసరాల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ పి.రామచంద్రరావు ద్వారా తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఎంసి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టిడిపి నాయకులు ఉన్నారు.



జంకెను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

'జంకె'కు తాటిపర్తి పరామర్శ

ప్రజాశక్తి-మార్కాపురం

అస్వస్థతకు గురైన మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి త్వరగా కోలుకోవాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆకాంక్షించారు. మార్కాపురంలోని జవహర్‌నగర్ కాలనీలో స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విద్యుత్తును పొదుపుగా వాడి భావితరాలకు వెలుగులు అందించాలని జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యుత్ శాఖ రూపొందించిన గోడపత్రా లను కలెక్టర్ ఆవిష్కరించారు. విద్యుత్తును వ్యర్థంగా వినియోగించరాదని కలెక్టర్ చెప్పారు. జాతీయ ఇంధనాన్ని పొదుపుగా వాడాలన్నారు. విద్యుత్‌ను వృథా చేయడం, వ్యర్థమైన విద్యుత్తు పరికరాలను వినియోగించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇంధన వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. భావితరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు చేసుకోవా లని వివరించారు. సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలను చైతన్యపర్చాలన్నారు. విద్యుత్తును ఎలా పొదుపు చేయాలి అనే అంశంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఉద్యోగులు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ప్లేకార్డులు, నినాదాలతో ప్రదర్శన పట్టణంలో సాగింది. ఈ కార్య క్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, ఈఇ పివిఆర్ మల్లికార్జునరావు, ఈఇ జి భాస్కర్‌రావు, ఈఇ పి హుస్సేన్‌ఖాన్, ఏవో పి శ్రీనివాసరెడ్డి, డిఇ టి శ్రీనివాసరావు, ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

45 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- 1779.6 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 3.98 కోట్లు రైతులకు చెల్లింపు
- దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు
- ప్రెస్ మీట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో 45 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ తెలియజేశారు. స్థానిక జెసి చాంబర్లో మంగళ వారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్లో ఈ నెల 16వ తేదీ వరకు 212 మంది రైతుల నుంచి రూ.3.99 కోట్ల విలువగల 1779.6 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.3.98 కోట్లను 211 మంది రైతులకు చెల్లించినట్లు జెసి వివరించారు. మిగిలిన డబ్బులను తదుపరి బ్యాంకు బ్యాచ్ ప్రాసెస్‌లో జమ చేస్తామన్నారు. జిల్లాలో లేట్ ఖరీఫ్, ఎర్లీ రబీ సాగును దృష్టిలో పెట్టుకుని రైతుల వద్ద నుంచి ప్రతి గింజా కొనుగోలు చేసేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో కూడిన ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. గోనెసంచులు, రవాణా వాహనాలు, టార్పాలిన్లు అందించినట్లు తెలిపారు. ధాన్యాన్ని విక్రయించడంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు 8008901457 ను సంప్రదించవచ్చని సంయుక్త కలెక్టర్ తెలిపారు. వాట్సాప్ 7337359375 లోనూ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు 24 గంటల లోపు నాణ్యతకు తగ్గ మద్దతు ధరను రైతులు పొందవచ్చని ఆయన తెలిపారు. జిల్లాలో 45 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దళారులను ఆశ్రయించి మద్దతు ధర కన్నా తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ వరలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ



వాజ్‌పేయికి నివాళి అర్పిస్తున్న మంత్రి, నాయకులు

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోటానికి దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి నిరంతరం కృషి చేశారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అటల్ మోదీ సుపరిపాలన బస్సు యాత్ర మంగళవారం బాపట్ల జిల్లాకు చేరుకుంది. బస్సు యాత్రకు రాష్ట్ర మంత్రులు ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా బాపట్ల పట్టణ జాతీయ రహదారి కూడలి వద్ద ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాసన మండలి సభ్యురాలు పోతుల సునీత, బాపట్ల, చీరాల, వేమూరు శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, ఎంఎం కొండయ్య, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవన్ కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షులు కె బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఎస్‌ఎస్ పనుల్లో వేగం పెంచాలి

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గంలో జరుగుతున్న ఆర్‌డిఎస్‌ఎస్ పనుల్లో మరింత వేగం పెంచాలని ఆ శాఖ అధికారులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఆర్‌డిఎస్‌ఎస్ పనులకు రూ. 78.4 కోట్లు మంజూరు కాగా... ఇప్పటి వరకు రూ. 58.07 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ భూముల్లో 310 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు గానూ 306 ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం జరిగింది. 49 పీడర్లలో ఆరు ఫీడర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. విద్యుత్ సరఫరాలో సమస్యల్లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో ఇఇ పివి నాగేశ్వరరావు, కన్‌స్ట్రక్షన్ డిఇ నాగేశ్వరరావు, మార్కాపురం డిఇ సియానాయక్, ఏఇలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికార బలంతో విగ్రహాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అనుమతులు లేకపోయినా, అధికార బలంతో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ విగ్రహాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఏర్పాటు చేస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు తెలిపారు. మంగళ వారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ప్రధాని వాజ్‌పాయ్ ఉత్తమ భారత పార్లమెంటేరియన్లలో ఒకరన్నారు. చట్టాన్ని గౌరవించే వాజపాయ్ విగ్రహాల ను చట్ట విరుద్ధంగా కూటమి ప్రభుత్వ అండతో భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేస్తోందని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు నగర శివారు వెంగముక్కలపాలెం బైపాస్ కూడలిలో సోమవారం వాజ్‌పాయ్ విగ్రహం ఏర్పాటుకు నగరపాలక సంస్థ అనుమతి కోసం అర్జీ కూడా పెట్టలేదన్నారు. ఒంగోలులో వాజ్‌పాయ్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవటం సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించటమేనన్నారు.